## 58. ఆధ్యాత్మిక రహస్యం

ఓసారి రుక్మిణి కృష్ణుడి చేతిలోని వేణువుని చూసి అడిగింది.

"విడవకుండా కృష్ణుడు ఎప్పుడూ నిన్ను తన చేతుల్లోనే వుంచుకుంటాడు కదా. పూర్వ జన్మలో నువ్వు అందుకు ఏం పుణ్యం చేసావు? ఆ రహస్యం నాకు దయచేసి చెప్పు."

అందుకు వేణువు నవ్వి జవాబు చెప్పింది.

"నా లోపల డొల్ల తప్ప ఏం లేదు. ఆ ఏమీ లేకపోవటమే నన్ను నందకిశోరుడికి దగ్గర చేసింది."

ఎవరైతే ప్రాపంచిక విషయాలని మనసులోంచి పూర్తిగా తొలగించుకుని, మనసుని ఖాళీగా వుంచుకుంటారో వారు సర్వాంతర్యామి అయిన ఆ మాధవుడితో సదా ఉండగలుగుతారు.

## 59. పండు - పచ్చి

ముక్తి మీద మక్కువ కలిగిన ఒకతను అందుకోసం ఓ ఆధ్యాత్మిక గురువుని ఆశ్రయించాడు.

"స్వామీ! నేను ముక్తికి ఎంత దగ్గరలో వున్నాను?" అని అతను తరచు తన గురువుని ప్రశ్నించసాగాడు.

ఓ రోజు గురువుకి ఎవరో తమ తోటలోని సపోటా పళ్ళు తెచ్చిచ్చారు. అవి పచ్చిగా వుండటంతో ఆ గురువు ముక్తి గురించి ప్రశ్నించే శిష్యుడ్ని పిలిచి చెప్పాడు.

"వీటిని బియ్యంలో పండేయి."

శిష్యుడు వాటిని బియ్యంలో కప్పేసాడు. గురువు గంట, గంటకి వెళ్ళి ఆ పళ్ళు పండాయేమోనని బియ్యంలోంచి వాటిని తీసి చూడసాగాడు. ఇది గమనించిన ఆ శిష్యుడు చెప్పాడు.

"స్వామీ! అవి పండటానికి నాలుగైదు రోజులు పడుతుంది. మీరు వాటిని మాటిమాటికీ బయటకి తీసి చూస్తూంటే అవి పండకపోగా కుళ్ళిపోవచ్చు."

"ముక్తి విషయంలో కూడా సరిగ్గా ఇలాగే జరుగుతుంది నాయినా. మనకి ముక్తి మీద కాక, దాన్ని సంపాదించే విధానం మీద ఆసక్తి వుండాలి." చెప్పాడు గురువు.

## 60. దృష్టికోణం

ఓ ఆశ్రమంలో ఓ గురువు తన శిష్యులకి ఆధ్యాత్మిక శిక్షణని ఇస్తున్నారు. సిగరెట్ తాగే అలవాటున్న ఓ శిష్యుడు చాలాసేపు జరిగే ప్రార్థన సమయంలో సిగరెట్ తాగడానికి గురువుని అనుమతి కోరాడు. ఆయన అందుకు అనుమతిని ఇవ్వకుండా కారణం చెప్పాడు.

"ప్రార్థన చేస్తూ సిగరెట్ తాగడం పాపం కాబట్టి ఆ పని ఎన్నడూ చేయక."

అయితే ప్రార్థన సమయంలో క్లాసులో ఇంకో శిష్యుడు గురువు అనుమతితో సిగరెట్ తాగడం ఇతని కంటపడింది.

"సిగరెట్ తాగడానికి నీకు అనుమతి ఎలా లభించింది?" ఆశ్చర్యంగా అడిగాడు ఆ శిష్యుడు.

"నీలా నేను ప్రార్థన సమయంలో సిగరెట్ తాగడానికి అనుమతిని కోరలేదు. సిగరెట్ తాగేప్పుడు దైవ ప్రార్థన చేయడానికి అనుమతిని అడిగాను." వివరించాడా రెండో శిష్యుడు.

ఇదేవిధంగా మన దృష్టికోణంలో చిన్న మార్పు చేసుకుంటే మన ఆధ్యాత్మిక ప్రగతి త్వరితం అవుతుంది.